ప్రజాశక్తి

ఆదివారం 16 జులై 2023 5

పార్వతీపురం మన్యం



రేపు ఫుడ్ ప్రాసెస్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి -కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా రూరల్ డెవలప్మెంట్ అథారిటీ సంయుక్తంగా జిల్లాలో నిరుద్యోగ యువత కోసం ఫుడ్ ప్రాసెస్ యూనిట్ స్థాపించడానికి ఒక వర్క్ షాప్‌ను ఈ నెల 17న సోమవారం మధ్యాహ్నం 3గంటలకు పట్టణంలోని వైకెఎం కాలేజీలో డిఆర్‌డిఎ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల యువత ఈ అవకాశం వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యు.సాయి కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు, ఫుడ్ ప్రాసెస్ యూనిట్ స్థాపించడానికి ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ నుండి 90శాతం రుణ సదుపాయం కూడా కల్పిస్తామని ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెఎస్ న్ రెడ్డి తెలిపారు.

జగనన్న కాలనీకి దారేది?



రహదారికి నోచుకోని జగనన్న దళిత కాలనీ

- డిప్యూటీ సిఎం సొంత పంచాయతీలో పరిస్థితి
- లబ్ధిదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

అన్ని రకాల మౌలిక వసతులతో జగనన్న కాలనీలు నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఆ సౌకర్యాల్లేలేని పరిస్థితి మండలంలోని మార్కొండపుట్టిలో చోటు చేసుకుంది. ఈ గ్రామంలోని దళిత కాలనీకి కేటాయించిన జగనన్న కాలనీకి వెళ్లేందుకు దారేలేని పరిస్థితి నెలకొంది. సాక్ష్యాత్తూ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర సొంత పంచాయతీలోని ఈ విధమైన నిర్మాణాలు జరగడం మరొక ఆశ్చర్యకరమైన విషయం. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీలో జగనన్న కాలనీకి రెండు లేఔట్ కేటాయించారు. ఇందులో 13 ఇళ్లకు గానూ ఎస్సీలకు కేటాయించారు. ఈ లేఔట్లకు సంబంధించి సరైన రహదారి లేకపోవడంతో గృహాలు కట్టేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిరాయితీ భూముల్లో నిర్మాణ సామాగ్రి తెచ్చుకునేందుకు భూయజమానులు అంగీకరించకపోవడంతో అర్ధాంతరంగానే కొన్ని ఇళ్లు నిలిచిపోయాయి. ఈ విషయమై పలుమార్లు తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీకి రహదారిని ఏర్పాటు చేయాలని దళితులు కోరుతున్నారు.

దళితులను వేరేగా కేటాయింపు ఎందుకు?

జగనన్న కాలనీలో ఇళ్ల కేటాయింపుల్లో అన్ని కులాలకు ఒకే చోట ఉండేలా కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నప్పటికీ పంచాయతీ పరిధిలో ఈ నిబంధన పాటించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారి అంతా బాగున్న ప్రాంతాన్ని బీసీల కేటాయించి, ఎలాంటి రహదారి సౌకర్యం లేని లేఅవుట్‌ను దళితులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అన్ని ప్రాంతాల మాదిరిగా ఇక్కడ ఎందుకు అందరికీ ఒకే చోట కేటాయింపులు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

దారి ప్రస్తావన మా వద్దకు వచ్చింది

ఎస్సీలకు కేటాయించిన లేఔట్‌లో దారి లేదని పలువురు లబ్ధిదారులు మా దృష్టికి తెచ్చారు. రహదారి విషయమై కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ పూర్తిస్థాయి దారి కోసం స్థానిక సచివాలయ సిబ్బంది, రెవెన్యూ ఉద్యోగులతో కలిసి స్థల పరిశీలన జరిగేలా కృషి చేస్తాం.

సింహాచలం, హౌసింగ్ ఎఇ

సబ్సిడీ ధరకు బియ్యం, కందిపప్పు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వం సబ్సిడీ ధరకు బియ్యం, కందిపప్పు అందజేస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం స్థానిక రాయగడ ప్రధాన రహదారిలో గల శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయం ఎదురుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సబ్సిడీ ధరలతో కూడిన సరుకులు బిపిటి గ్రేడ్-1 రకం, కంది పప్పు గ్రేడ్-1 రకం పంపిణీ ప్రత్యేక కౌంటర్ల ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు పాల్గొని కౌంటర్లు ప్రారంభించి వారి చేతులు మీదుగా సబ్సిడీ సరుకులు ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం జెసి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో అధిక ధరల నియంత్రణకు పేదలకు అందుబాటు ధరలో నిత్యావసర సరుకుల పంపిణీకి టోకు వర్తకుల సహకారంతో ప్రభుత్వం సబ్సిడీ ధరలకు గ్రేడ్-1 బియ్యం, గ్రేడ్-1 కంది పప్పు ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు వచ్చేందుకు జిల్లాలో 7 కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో భాగంగా పార్వతీపురం 2 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే ఈ ప్రత్యేక కౌంటర్ల ద్వారా బహిరంగ మార్కెట్లో ధరలను అదుపు చేసేందకు అవకాశం ఉంటుందన్నారు. కావున ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, డిఎస్ఒ ఆర్.శివప్రసాదరావు, వర్తక వాణిజ్య సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సబ్సిడీ సరుకులను అందజేస్తున్న జెసి గోవిందరావు, ఎమ్మెల్యే జోగారావు

సాలూరు: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చెప్పారు. పట్టణంలోని చిన బజార్, నెయ్యిలవీధిలో టోకు వర్తకుల చేత బియ్యం, కందిపప్పు చౌకగా అమ్మకాలను ఆమె ప్రారంభించారు. మార్కెట్ లో పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బియ్యం, కందిపప్పు విక్రయించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ధరలు అందుబాటులో వుండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ హెచ్ శంకరరావు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు శనివారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ జె.రామఅప్పలనాయుడుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా నేటికీ ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. తక్షణమే మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పర్మినెంట్ ఉద్యోగులకు రెండేళ్ల సరెండర్ లీవ్ వేతనాలు ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు బకాయి హెల్త్ అలవెన్స్ విడుదలకు చర్యలు చేపట్టాలని, క్లాస్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, బకాయి పడిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, ఆప్కాస్ వల్ల 60ఏళ్లు నిండిన వారు, అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సాలూరు, పార్వతీపురం, పాలకొండ లో వెంటనే నియామకాలు చేపట్టాలని, పట్టణంలో పెరుగుతున్న జనాభాకు తగినంత మంది కార్మికుల సంఖ్యను పెంచి ఉన్న కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 20,21న రిలేనిరాహార దీక్షలు, 27న మున్సిపల్ కార్యాలయం ముట్టడి, ఆగస్టు 7న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, కార్మికులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం మల్లేష్, నాగవంశం నిర్మల, పడాల గాంధీ, మామిడి శివ, బంగారి రాజేష్ , బంగారి రవి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

ప్రజాశక్తి -సీతంపేట

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ నిమిత్తం శనివారం డిఎల్‌ఎస్‌వి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి మాట్లాడుతూ కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. కేసులకు సంబంధించిన నివేదికలను త్వరితగతిన తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డిసిలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - సీతంపేట

యువతలో నైపుణ్యాలను మెరుగుపర్చి వారి ఉపాధికి బాటలు వేసేలా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అడుగులు వేస్తోంది. ఐటి/టూరిజం అండ్ హాస్పిటాలిటీ/రంగంలోని వివిధ విభాగాల్లో పార్వతీపురం మన్యం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో శిక్షణా ఇవ్వడానికి ఎంపికలు నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు డీడీయూజీకేవై, సీడాప్, ఏపీఎస్- ఎస్ డీసీ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వసతి, భోజనంతో పాటు ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తామతన్నారు. తరగతులు పూర్తయ్యాక ఉపాధి ఇవ్వనున్నట్టు తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, ఆటోమోటివ్ అండ్ ఏరోస్పేస్‌లో బిటెక్/డిప్లొమా విభాగాల్లో ఏదైన డిగ్రీ, ఇంటర్- 2020, 21, 22 సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 23 ఏళ్ల వయసు గల యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత విద్యార్హత పత్రాలతో యూత్ ట్రైనింగ్ సెంటర్ సీతంపేట కేంద్రానికి రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7032060773 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బలిజిపేట మండలం మిర్తివలసలో 8 ఏనుగుల గుంపు సంచరిస్తుందని, వాటిని చూసేందుకు అవి సంచరించే ప్రాంతాల దగ్గర గుమికూడవద్దని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవి ఏనుగుల ప్రవర్తన ఊహించలేనిదని, వాటిని రెచ్చగొడితే అవి అసురక్షిత అని భావించినా, భయపడితే ఏనుగులు గుమిగూడిన గుంపుపై దాడి చేసి మానవ నష్టాన్ని కలిగించవచ్చునని హెచ్చరించారు. కావున వన్యప్రాణులను చూసేందుకు గ్రామస్తులు పెద్దఎత్తున గుమికూడవద్దని, వాటి కదలికలను గమనిస్తే గ్రామపెద్దలు, సర్పంచ్‌లకు తెలియజేయాలని అన్నారు. మానవ నష్టం లేదా ఏనుగు మరణాన్ని నివారించడమే అటవీశాఖ ప్రధాన ప్రాధాన్యత అని, అడవి ఏనుగుల బెడదతో రైతు నష్టపోవడంపై అటవీశాఖ ఆవేదన వ్యక్తం చేస్తోందని, ఒకవేళ ఎవరికైనా నష్టం కలిగిస్తే అడవి ఏనుగులబారిన పడినా రైతులతో పాటు ఇతరులు నష్టపరిహారం పొందేందుకు స్థానిక అటవీశాఖ సిబ్బంది అందించిన ఫారమ్‌లను నింపాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ తమ పంట నష్టపరిహారాన్ని క్లెయిమ్ చేయడంలో అటవీ శాఖకు సహకరించాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఏదైనా ఆస్తి నష్టం జరిగితే, బాధిత వ్యక్తులు నష్టపరిహారాన్ని క్లెయిమ్ చేయడానికి సంబంధిత తహశీల్దార్ ద్వారా వారి నష్టాన్ని కూడా అంచనా వేయవచ్చునని తెలిపారు.

ఉపాధ్యాయుడు దారుణ హత్య



కృష్ణ మృతదేహం

- బొలెరో వాహనంతో ఢీకొట్టి.. ఆపై ఇనుప రాడ్లతో కొట్టి..
- కొత్తపేట సమీపంలో ఘటన
- మృతదేహంతో రహదారిపై గ్రామస్తుల బైఠాయింపు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

రాజాం మండలం ఒమ్మి-కొత్తపేట సమీపంలో శనివారం ఉదయం ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ (48) దారుణహత్యకు గురయ్యాడు. ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తుండగా సినీ ఫక్కీలో బొలెరో వాహనంతో ఢీకొట్టి, ఆ తరువాత రాడ్లతో కొట్టి దుండగులు హత్య చేశారు. స్థానికులు చూసి కేకలు వేయడంతో బొలేరో వాహనంలో వచ్చిన వారు పరారయ్యారు. సంఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..

ప్రజాశక్తి-రాజాం, రేగిడి, బాడంగి

తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ఏగిరెడ్డి కృష్ణ (48) అదే మండలంలోని కాలంరాజుపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య రాజాంలోని సామాజిక ఆస్పత్రిలో హెచ్‌డిగా పనిచేస్తుండడంతో పట్టణంలోని ఈశ్వర నారాయణ కాలనీలో నివాసం ఉంటున్నారు. కృష్ణ రోజూ రాజాం నుంచి పాఠశాలకు బైక్‌పై వెళ్లి వస్తుంటారు. స్వస్థలమైన ఉద్దవోలుకు కూడా అవకాశం ఉన్నప్పుడల్లా వెళ్లి వస్తుంటారు. గ్రామ స్థాయి రాజకీయాల్లో ఆయన పరోక్ష పాత్ర పోషిస్తున్నారు. ఆయన మద్దతిచ్చిన వారే సర్పంచ్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆయన్ను రాజకీయంగా విబేధించిన వారే ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చునని కుటుంబ భ్యులు ఆరోపిస్తున్నారు. శనివారం ఉదయం పాఠశాలకు బయలుదేరిన కృష్ణను ఒమ్మి-కొత్తపేట సమీపంలో వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంతో పాటు రోడ్డుపై పడిపోయిన కృష్ణను బొలేరో వాహనం కొంత దూరం ఈడ్చుకుని వెళ్లిపోయింది. కృష్ణ తీవ్రగాయాలైన ఆయన ఇంకా బతికే ఉన్నాడని గమనించిన దుండగులు రాడ్‌లతో అతన్ని కొట్టి హత మార్చారు. స్థానికంగా ఉన్న కొందరు చూసి కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. స్థానికులు రాజాం పోలీసులకు, కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందడంతో వారు కూడా అక్కడికి చేరుకున్నారు. ఉద్దవోలు గ్రామస్తులతో పాటు సన్నిహి తులు, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకొని కృష్ణ మృత దేహంతో సాలూరు రోడ్డులో బైఠాయించి ఆందోళనకు దిగారు. హత్యకు పాల్పడిన నిందితులను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న చీపురుపల్లి డిఎస్‌పి శ్రీనివాస్ చక్రవర్తి, రాజాం సిఐ రవికుమార్ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఇదే సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్నప్పలనాయుడు అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలపడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



కృష్ణ (ఫైల్)

కుదరని సమన్వయం

- చెల్లాచెదురవుతున్న కేడర్
- తీరు మారని టిడిపి నాయకత్వం

ప్రజాశక్తి, పాలకొండ,పాలకొండ రూరల్

ఒకప్పుడు పాలకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. 2009 నుంచి టిడిపికి ఎదురుగాలి వీస్తుంది. అయితే రాను రాను పార్టీ పరిస్థితి అయోమయంగా మారుతుంది. ఈ నియోజకవర్గంలో కేడర్ బలంగా ఉన్నప్పటికీ, నాయకుల మధ్య సమన్వయం కుదరక కార్యకర్తలు చెల్లాచెదురవుతున్నట్లు ఆ పార్టీ నేతలే ఆందోళన చెందుతున్నారు. 2019 ఎన్నికల నుంచి పార్టీలో ఈ గ్రూపు పోరు ఎక్కైంది. అధికారంలో లేకపోయినా నేతలు ఐక్యమత్యంగా లేకపోవడంతో కార్యకర్తలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణకు వ్యతిరేకంగా కొంతమంది నాయకులు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఇన్‌ఛార్జిగా జయకృష్ణ తమకు వద్దు అని, బలమైన సామాజికవర్గానికి చెందిన నేతలు పట్టుపట్టారు. అయితే ఇటీవలే రాష్ట్ర రాజధానిలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు పాలకొండ నియోజకవర్గ నేతలతో జరిపిన సమీక్షలో అందరూ ఏకతాటిపైకి రావాలని, ఐక్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఇన్‌ఛార్జి జయకృష్ణ అసమ్మతి నేతలను కలుపుకుని పోవాలని సూచించారు. అధినేత చెప్పినా ఇక్కడ పరిస్థితి ఇసుమంతమాత్రం మారలేదు. యధావిధిగా గ్రూపు విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవలే జరిగిన బస్సుయాత్రలో ఈ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. జయకృష్ణను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని ఆయన గ్రూపీయులు చెబుతుండగా, అభ్యర్థిగా ఇంకా ఎవర్నీ ప్రకటించలేదని అసమ్మతి నేతలు బహిరంగంగా చెబుతున్నారు. దీంతో అధినాయకుడు చెప్పినా కూడా గ్రూపుల పోరు తగ్గలేదు. ఎవరికి వారే యమునతీరే అన్నట్లు పార్టీ పరిస్థితి ఉంది. నాయకులే ఇలా ఉంటే కార్యకర్తల పరిస్థితి ఏంటి అని, ఇలా అయితే పార్టీకి గత వైభవం తీసుకురావటం కష్టమని రాజకీయనాయకులు అభిప్రాయపడుతున్నారు.



వీరఘట్టంలో జరిగిన బస్సు యాత్రలో బాహాబాహీకి దిగిన టిడిపి కార్తకర్తలు, నాయకులు (ఫైల్)

కళాకు దూరం అవుతున్న నేతలు

ఈ ప్రాంతంలో బలమైన సామాజికవర్గానికి చెందిన ముఖ్యనేత కిమిడి కళావెంకటరావుకు ఆ పార్టీ నేతలు దూరవుతున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రాంతంలో టిడిపిలో ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా ఆయన మీదే ఆధారపడి, ఇష్టం ఉన్నా లేకున్నా ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉండేవారు. అటువంటిది తాజాగా ఆయనకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. అదే సామాజికవర్గానికి చెందిన నియోజకవర్గ స్థాయి నాయకులు ఆయన్ను వ్యతిరేకిస్తున్నారు. వర్గపోరును చక్కదిద్దాల్సిన నేత మౌనంగా ఉండడంతో పాటు ఒక వర్గాన్ని వెనకేసుకొస్తున్నారని, మరో గ్రూపునకు చెందిన నేతలు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా టిడిపికి ఈ గ్రూపువిభేదాలు ఇబ్బందికరంగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్షమా..! నువ్వెక్కడ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలో ప్రతిపక్ష పార్టీ ఉనికిపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అసలు ఉందా? లేదా? అంటూ పలువురు ఒకింత హాస్యాస్పద సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ ప్రతిపక్ష పార్టీ ఉందనుకున్నా ప్రతిపక్షం అనే పాత్రపోషించలేక పోతుందని మరికొందరు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వం చర్యలు, జిల్లాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను తిప్పికొట్టడంలో టిడిపి పూర్తిగా విఫలమైంది. ప్రతి నియోజకవర్గంలోనూ అంతర్గతపోరే ఇందుకు కారణమన్న చర్చ బాహాటంగానే సాగుతోంది. ముఖ్యంగా చెరకు రైతుల సమస్యపై అధికార పార్టీ నోరు మొదపడం లేదు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూసేయడమే కాకుండా రైతులు సాగు తగ్గించుకోవడం వల్లే ఫ్యాక్టరీ తెరవలేకపోతున్నామంటూ బుకాయించినా మూగబోయిన ప్రతిపక్షం నోరు తెరుచుకోలేదు. దీంతో, చెరకును గత్యంతరం లేని పరిస్థితుల్లో 40 నుంచి 70కిలోమీటర్ల దూరంలోవున్న సంకిలికి తరలించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఎస్.కోట నియోజకవర్గ వ్యాప్తంగా భూకబ్జాలు జరిగాయంటూ సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రఘురాజు బహిరంగంగా ప్రకటించినప్పటికీ అక్కడి టిడిపి నేతలు కిమ్మనలేదు. ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చినా ఇప్పటికీ శివారు ఆయుకట్టుకు నీరందించాలని మాట్లాడలేదు. మరోవైపు 1.21లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన తోటపల్లి ద్వారా 80వేలకు మించి సాగునీరు అందే పరిస్థితి లేదని సాక్షాత్తు ఇరిగేషన్ శాఖ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ నిర్వాసితులు నష్టపరిహారం పునరావాసం కోసం ఆందోళన చెందుతున్నా పట్టించుకోలేదు. అటు మన్యం జిల్లాలో జీడిరైతుల అందోళన అక్కడి టిడిపి నాయకులకు పట్టలేదు. ఇటీవల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 36గంటల మహాధర్నా చేపట్టిన విషయం విధితమే. వేలాది సంఖ్యలో తరలివచ్చిన అంగన్‌వాడీలు ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అనేక ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాలు స్వచ్ఛందంగా ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేసినప్పటికీ టిడిపి, వాటి అనుబంధ సంఘాల పత్తా కనిపించలేదు. దీంతో, గతంలో అంగన్‌వాడీల ఆందోళన సందర్భంగా టిడిపి ప్రభుత్వం గుర్రాలతో తొక్కించిన సందర్భాన్ని పలువురు గుర్తుచేశారు. ఇలా ఒకటా? రెండా? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడంలో ప్రతిపక్ష హోదాలోవున్న టిడిపి పూర్తిగా విఫలమైంది. పైగా అంతర్గత విభేదాలతో జిల్లా పార్టీ కొట్టుమిట్టాడుతోంది. బొబ్బిలి మినహా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ రెండుగా చీలి వుంది. జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, స్థానిక మాజీ ఎమ్మెల్యే గీతను కలుపుకుని ముందుకు వెళ్లేందుకు సాహశించడం లేదు. దీంతో, గీత ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడిని కూడా అశోక్ గజపతిరాజు టార్గెట్ చేశారన్న చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే కరణం శివరామకృష్ణ ఆ నియోజకవర్గంలో ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కెఎ నాయుడు శ్రీకాకుళం మండలం ఎచ్చెర్లకు చెందిన మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు ఆశీస్సులతో ముందుకు సాగుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో కలిశెట్టి అప్పలనాయుడు చేస్తున్న పార్టీ కార్యకలాపాలు కళావెంకటరావుకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. రాజాంలో మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కళావెంకటరావు గ్రూపులోనూ, కోండ్రు మురళి అశోక్ గజపతిరాజు గ్రూపులోనూ ఉన్నారు. ఎస్.కోటలో స్థానిక మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైనా గొంపకృష్ణ మధ్య పార్టీలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. భోగాపురంలో కర్రోతు బంగార్రాజుకు ఇటీవల సీటు ఖరారైనట్టు ప్రచారం జరగడంతో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామితోపాటు మరో నేత అంతర్గతంగా మదన పడుతున్నట్టుగా చర్చ నడుస్తోంది. చీపురుపల్లిలో చీలికలేవీ కనిపించకపోయినప్పటికీ ఆ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్న కిమిడి నాగార్జున జిల్లా పార్టీ సారధి పాత్రపోషించలేకపోతున్నారని చర్చ నడుస్తోంది. గ్రూపులను నివారించకపోవడం ఇందుకు కారణం. అటు మన్యం జిల్లా సాలూరులో మాజీ ఎమ్మెల్సీ గుమ్మిడి సంధారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్‌ల మధ్య అంతర్గత యుద్ధం కొనసాగుతోంది. కురుపాంలో దత్తిలక్ష్మణరావు గ్రూపులు కడుతున్నారన్న చర్చ సాక్షాత్తు ఇటీవల చంద్రబాబు సమక్షంలోనే జరిగిన పంచాయతీలో తేలింది. పార్వతీపురంలో టిడిపి నాయకులు ఏకంగా వైసిపి నాయకులతోనే కుమ్మకయ్యారనే ప్రచారం నడుస్తోంది. ఇలా వచ్చే ఎన్నికల్లో సీట్ల కోసం కొందరు, ఉనికి కోసం మరికొందరు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాసమస్యలు, ప్రభుత్వ తప్పిదాలను, ఇష్టారాజ్యంగా వ్యవహరించే తీరును పట్టించుకోక పోవడంతో జిల్లాలో ప్రతిపక్షం ఉందా? లేదా? అంటూ ప్రజానీకం విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ, ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కూడా జనం చర్చించుకుంటున్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - పార్వతీపురం

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ శనివారం అభినందించారు. ఐటిడిఎ కార్యాలయంలో విద్యార్థులను సత్కరిస్తు ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ ఉన్నత చదువులు అందుకోవాలని ఆయన సూచించారు. చదవాలనే కోరిక, ఆసక్తి ఉండి ఇష్టంగా చదివితే అనుకున్నది సాధించడానికి ఎన్నో అవకాశాలు ఉంటాయని చెప్పారు.

పనులు వేగవంతం చేయాలి

అంతకు ముందు పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. పనులు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. రానున్న వర్షాల కారణంగా పనులు పూర్తి చేయడం కష్టమవుతుందని, కావున పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సామాగ్రి సిద్ధం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు.

నేత్ర వైద్య శిబిరాన్ని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని బందలుప్పి పిహెచ్‌సి పరిధిలో గల బాలగుడబలో శనివారం నియోజకవర్గ నేత్ర వైద్యాధికారి జి.నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగన్నాధరావు పర్యవేక్షించారు. రోగులకు కంటి చూపు నివారణకు పలు సూచనలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వా, తాతలకు కంటి చూపు కాపాడు కోవాలని కోరారు. ఈ నేత్ర పరీక్షల్లో కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం పంపిస్తున్నట్లు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి జగదీష్, నేత్ర వైద్య సహాయకులు ఉమామాహేశ్వరి, ఆరోగ్య కార్యకర్త రామలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పుట్టిగాం, బంజారగూడ, రేగులుగూడ, పూతికవలస గిరిజన గ్రామాల్లో రెండో విడత స్ప్రేయింగ్ శతశాతం పూర్తయిందని డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి అన్నారు. ప్రతి ఒక్కరూ పిచికారీ చేయించుకోవాలన్నారు. దీనివల్ల దోమలు రావని వ్యాప్తి చెందవన్నారు. జ్వరాలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయి చరణ్, సత్యవేణి, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం సమితి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగులు వీరఘట్టం సమితి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులు మజ్జి నాగభూషణరావు, ఉపాధ్యక్షులు ఎ.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎల్ త్రినాధరావు, సంయుక్త కార్యదర్శి జి.సత్యనారాయణ, కోశాధికారి కె.రామ్మోహన్, 1వ జిల్లా కౌన్సిలర్ వై.వెంకటరమణ, 2వ జిల్లా కౌన్సిలర్ డి.కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వైవి సూరపు నాయుడు, సతివాడ సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .



మండల మహాసభలో మాట్లాడుతున్న గిరిజనసంఘం నాయకులు అప్పారావు

గిరిజన హక్కులపై పాలకుల దాడి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన హక్కులు, రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర పాలకులు దాడి చేస్తున్నారని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బి.అప్పారావు విమర్శించారు. శనివారం ఎపి గిరిజన సంఘం ఏడో మండల మహాసభ నాయకులు ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాతూ గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. జీడీ పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా జె.శ్రీరాములు, కార్యదర్శిగా బి.సాయి, ఉపాధ్యక్షులుగా బి. పరశురాం, పి సలీం, పి.వీరన్న, కార్యదర్శులుగా ఎస్.ఆనందరావు, ఎస్.బాలు, బి.సంతు, ఎస్.వెంకన్న, కోశాధికారిగా ఎస్.శ్రీను ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుల్లేకుండా గిరిజన విద్యార్థుల చదువులెలా?

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధ్యాయుల్లేకుండా గిరిజన విద్యార్థులు చదువుకోవడం ఎలా అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధికారులను ప్రశ్నించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పత్రిక విలేకరులతో మాట్లాడుతూ కురుపాం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 8మంది అధ్యాపకుల్లేరని, ఇలా అయితే గిరిజన విద్యార్థుల చదువులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని, లేనిచో పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

వీరేష్ చంద్రదేవ్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

టిడిపి నాయకులు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను మండల టిడిపి నాయకులు శనివారం కలిశారు. ఈ మేరకు మండల పరిధిలోని ఉల్లిభద్ర జంక్షన్లో మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్‌తో పాటు నాయకులు రామారావు, గంట నాగరాజు, బోనెల వెంకటి తదితరులు వీరేష్ చంద్రదేవ్‌ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కషి చేయాలని ఈ సందర్భంగా మండల తెలుగు యువత అధ్యక్షులు బొచ్చ జగదీష్ తదితరులను కోరారు.

నిరుద్యోగులతో భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్, ఆరిక ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు, అధ్యాపకులతో భర్తీకి ప్రకటన చేయడం నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. ఏ తరహా పోస్టులైనా నిరుద్యోగ అభ్యర్థులతో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించి భర్తీ చేయాలని కోరారు.

డిజిటల్ డిటాక్స్‌పై అవగాహన


ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విద్యాలయం బ్రాంచ్ ఇన్‌ఛార్జి బికె రత్నం ఆధ్వర్యాన డిజిటల్ డిటాక్స్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.భాస్కరరావు అనుమతి మేరకు విద్యార్థులకు యూత్-20 కార్యక్రమంలో భాగంగా డిజిటల్ డిటాక్స్‌పై అవగాహన కల్పించారు. డిజిటర్ తరగతుల్లో విద్యార్థుల మెదడుపై ఒత్తిడి పెరుగుతుందని, దాని నుంచి బయటపడాలంటే ధ్యానం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో బికె శిల్ప,బికె పద్మ శ్రీ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద శ్రమదానం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై నీలకంఠం ఆధ్వర్యంలో శనివారం పోలీస్ సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపు, పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పోలీసు సిబ్బంది

సమస్యల పరిష్కారమే సురక్ష లక్ష్యం

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని గల 15,16 వార్డులకు సంబంధించి గారమ్మకాలనీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్స్ వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకరరావు, కోడెం విజయకుమార్, కిల్లారి మోహన్ రావు, నీలాపు శ్రీనివాసరావు, వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, పాలకొండ వైస్ ఎంపిపి కణపాక సూర్య ప్రకాష్, దుంపల చిన్ని, చంద్రమౌళి, ముద్దాడ చక్రవర్తి, మరియదాస్, అధికారులు పాల్గొన్నారు. పాలకొండ పంచాయతీ పరిధిలోని ఎస్ఎస్ఎన్, ఎస్ఎల్ఆర్, అయ్యప్ప రైస్ మిల్లులలో తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఒక కార్డ్ కు నెలకు 10 కేజీల చెప్పునా ఫైన్ రైస్ ఒక కేజీ 38 రూపాయలకు అందించేందుకు గాను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకొండ, రూరల్ : మండలం అంపిలిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, పాలకొండ వైస్ ఎంపిపిలు కణపాక సూర్య ప్రకాష్, వాకముడి అనిల్, సర్పంచులు లోలుగు విశ్వేశ్వరరావు, గవర రాజశేఖర్, గవర దుర్గారావు, సంగంనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థిని పాడి హేమలత (587)ను సన్మానించారు.

వీరఘట్టం : మండలంలోని చిదిమి, నడుకూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిపి డి.వెంకటరమణ నిర్వహించారు. అనంతరం పలువురికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు డి.ఉమామహేశ్వరరావు, కర్రి రమాదేవి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రి లీలాప్రసాదరావు, తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జి.జయంత్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి వి.రామచంద్రరావు, ఆర్‌ఐ ఎస్.మారుతీరావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర ఏళ్లలో పేదల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. అర్హులుగా ఉండీ సంక్షేమ పథకాలు అందని వారుంటే వారిని గుర్తించి పథకాల మంజూరుకు సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్ల కృషి చేయాలని అన్నారు. కొత్తగా మంజూరైన ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి, ఇఒపిఆర్ డి.జగదీష్ కుమార్, తహశీల్దార్ రాములమ్మ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.


భామిని : మండలంలోని నులకజోడు లో సర్పంచ్ కొత్తూరు ప్రసాద్ రావు, కొసలి గ్రామం లో సర్పంచ్ మజ్జి మోహన్ బాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నీలపు అప్పారావు, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపిడిఒ చంద్రరావు, ఎంపిటిసి బూస బాలకృష్ణ, జెడ్‌పిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాద్ రావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని తోణాంలో సర్పంచ్ మువ్వల ఆదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధానకార్యదర్శి దండి శ్రీనివాసరావు, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, మాజీ వైస్ ఎంపిపి సువ్వాడ రామకృష్ణ, సచివాలయం సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేట, కాశాయిపేట గ్రామ సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎ.జోగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగనన్న సురక్ష క్యాంప్ ద్వారా మంజూరు కాబడిన 11రకాల సేవల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వేదికల వద్ద ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బలగ రమణమ్మ, వైసిపి మండలపార్టీ అధ్యక్షులు, ఎంపిడిఒ ప్రసాద్, తహశీల్దార్ ఎంవి రమణ, పలువురు వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉప తహశీల్దారు మధుసూదన్‌రావు ఆధ్వర్యాన జరిగింది. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. అలాగే సంక్షేమ పథకాలు అందనివారుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే హడ్డుబంగిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఉపసర్పంచ్ పి.బృందావతి, కార్యదర్శి బాణాల సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలస సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి ఉరిటి రామారావు, తహశీల్దార్ జి.వెంకటజనార్ధన్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అవసరమైన ధ్రువపత్రాలు లేక ప్రభుత్వ పథకాలకు అర్హులైన ఏ ఒక్కరూ దూరం కాకూడదని, అర్హులు మిగలకుండా సంక్షేమ, అభివృద్ధి పథకాలు లబ్ధిపొందలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండల ఇఒపిఆర్‌డి గోపాలరావు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తిరుపతి భాస్కరరావు, మరడాన భార్గవరావు, విఆర్ఒ రేగిడి రామాంజనేయులు, వైసిపి నాయకులు బోను చంద్రశేఖర రావు (చంద్ర), బోను అచ్యుతరావు, పప్పల సత్యనారాయణ, గ్రామ సచివాలయ సిబ్బంది గంట జనార్ధనరావు, రెడ్డి కుంతి, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్



డిఎంహెచ్ఒకు వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

సమస్యలపై ఆశాల వినతి

ప్రజాశక్తి - బెలగాం

పనిభారాన్ని తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆన్లైన్ వర్క్ భారాన్ని తగ్గించాలని, ఆన్లైన్ లేదా రికార్డ్స్ వర్క్ ఏదైన ఒక పని ఒకసారి మాత్రమే చేయించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సిఐటియు ఆధ్వర్యాన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డి.జగన్నాధరావు, స్థానిక ఏరియా పిపి యూనిట్ ఆఫీసర్‌కు శనివారం వినతిని అందజేశారు. అనంతరం సిఐటియు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు పరచాలని, సచివాలయం, సబ్ సెంటర్స్ లో ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోబెట్టడం ఆపాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని, టిఎ, డిఎ లు ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆశా కార్యకర్తలపై పనిభారం పెరిగిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.గౌరి, శివాని, త్రివేణి, భాగ్యలక్ష్మి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల శివన్నపేటలో శనివారం బిఎల్ఒలతో కలిసి తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ డోర్ టు డోర్ ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్వోలకు ఫారం 6 , ద్వారా కొత్తగా ఓటర్లను చేర్పించాలని , ఫారం 8 ద్వారా తప్పులు సవరించి, అర్హులకు ఓటు హక్కు కల్పించేందుకు బిఎల్ఒలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డిటి నాగేశ్వరరావు, బిఎల్ఒలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

స్థానిక నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పుట్టినరోజు వేడుకలు శనివారం ఆయన స్వగ్రామమైన కృష్ణపల్లిలో వేడుకగా జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఫోన్లో శుభాకాంక్షలు తెలియజేయగా, నియోజకవర్గంలోని సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం అర్బన్, రూరల్ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు హాజరై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహాశక్తి పథకాలను ప్రచారం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన వాహనాన్ని జగదీష్ కార్యకర్తల మధ్య ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర గాండ్ల తెలకల సాధికారిక చైర్మన్ జి.విశాలాక్షి, అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు జి వెంకట నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - సీతంపేట

పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని చిన్నబగ్గ పంచాయతీలో జరిగిన "గడప గడపకు - మన ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రతి గడపకు అందుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇళ్లులేని ప్రతి పేదవాడికి సొంతింటి కలను సాకారం చేస్తున్నామన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి "గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఇంకా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే అటువంటి వారిని కూడా ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్ రావు, జెడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో బిఎల్ఒల ద్వారా ఇంటింటికి వెళ్లి ఓటర్ సర్వే చేస్తున్నామని సర్పంచి బి.గౌరీశంకరరావు తెలిపారు. గ్రామ సచివాలయంలో వైసిపి, సిపిఎం, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటర్ జాబితాలో చేర్పులు మార్పులు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, కార్యదర్శి కిషోర్ , వీఆర్వో హరికష్ణ, ఉప సర్పంచ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తం : డిఐఒ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

హైరిస్క్ గర్భిణు కేసుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పనసభద్ర, కోరె, ఇందుపురం, మడకవానివలస గ్రామాలను శనివారం సందర్శించారు. గర్భిణుల గృహ సందర్శనలు చేసి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఐరన్, కాల్షియం మాత్రలు వేసుకోవడం, అంగన్వాడీలో పౌష్టికాహారం తీసుకోవడం అంశాలను అడిగి తగు సూచనలు ఇచ్చారు. మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత వైద్యాధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి వారి పరిధిలో ఉన్న గర్భిణీల ఆరోగ్య తనిఖీ వివరాలు ఎప్పటికప్పుడు విధిగా ఎంసిపి కార్డులో నమోదు చేయించాలని, వాటిని పరిశీలించి వైద్యాధికారులు అందులో సంతకాలు చేయాలని ఆదేశించారు. గర్భిణులను గుర్తించిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసి, అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎటువంటి ప్రమాద సూచికలు (హైరిస్క్)గుర్తించినా వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

వేక్సినేషన్ పరిశీలన

కోరె గ్రామం, ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పిల్లలకు ధనుర్వాతం, కంఠసర్పి నివారణకు వైద్య సిబ్బంది నిర్వహించిన టిడి వ్యాక్సినేషన్ ప్రక్రియను డిఐఒ పరిశీలించారు. వ్యాక్సినేషన్ కేంద్రంలో ఉండాల్సిన మార్గదర్శకాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీకా ఆవశ్యకతను ఉపాధ్యాయులకు, పిల్లలకు వివరించారు. అలాగే పలు గ్రామాల్లో పిల్లల టీకా కార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ఏమైనా సంభవిస్తున్నాయా అని అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ జరుగుతుందని, వారికి వివరిస్తూ, వీటి పర్యవేక్షణ పూర్తి స్థాయిలో చేపట్టి, అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సరోజిని, భారతి, అంగన్వాడీ సిబ్బంది లక్ష్మి , ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

30, 31 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 30,31తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు సాలూరులో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండు చెప్పారు. శనివారం బంగారమ్మ పేటలో ఉన్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో జిల్లా ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇంకా విద్యార్థుల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ సమస్యలు పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ గురించి ప్లీనరీలో చర్చించనున్నట్లు చెప్పారు. మహాసభలను మేధావులు, విద్యావేత్తలు విజయవంతం చేయాలని పండు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సాగుభూములకు పట్టాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెద్దమరికి పంచాయతీ శివాందరవలస గిరిజన గ్రామపరిధిలో పెద్దమరికి రెవిన్యూ 1-1 సర్వే నెంబర్లో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ శనివారం వ్యవసాయ-ార్మిక సంఘం నాయకులతో కలిసి గిరిజనులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వినతిని అందజేశారు. గిరిజనులు మాట్లాడుతూ ఆ రోజుల్లో ప్రభుత్వం నిర్మించిన డ్యామ్‌లో పోయిన భూములకు మెట్టపై ఇల్లు కట్టించి ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిందని, అలాగే గిరిజనుల తాతదంద్రుల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం అధ్యక్షులు కడ్రక ప్రమీల, ఉర్లక విజయ్ కుమార్, పీడక నరేంద్ర, కొండ గౌరై శశిరేఖ ,జయరాం ,గంట చిన్నారావు ,గరుగుబిల్లి భారతి ,రాణి ,శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన పెంట తిరుపతిరావు

'టిడిపి గెలుపే ధ్యేయంగా పనిచేస్తాం'

ప్రజాశక్తి - మక్కువ

సాలూరు నియోజకవర్గంలో టిడిపి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు పెంట తిరుపతిరావు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయ కమిటీలో తనను సభ్యునిగా చేరుస్తూ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. అందరితో కలిసి పార్టీ విజయానికి మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ సారథ్యంలో సాలూరు నియోజకవర్గం లో టిడిపి జెండా ఎగురవేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తామన్నారు.

లారీ ఢీకొని రెండు ఎద్దులు మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని జగ్గునాయుడుపేట జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీస్ అందించిన వివరాల మేరకు జగ్గునాయుడు పేటకు చెందిన చొక్కాకు గౌర్నాయుడు, పెంట శ్రీనివాసరావుతో పాటు మరో ఇద్దరు ఇసుక కోసం నాటుబండితో గ్రామం నుంచి సువర్ణముఖి నదికి వస్తుండగా బొబ్బిలి నుంచి పార్వతీపురం వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో చొక్కాకు గౌర్నాయుడికి చెందిన రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందగా, గౌరునాయుడు గాయపడ్డాడు. అలాగే పెంట శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. వీరిని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసును ఎస్సై నీలకంఠం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎపి పిజిసెట్‌లో 'సాయిరాం'కు ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - బెలగాం



ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా శుక్రవారం ఎపి పిజి సెట్-2023 ఫలితాలల్లో సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. శుక్రవారం ఏపీ పీజీ సెట్ ఫలితాలు విడుదల సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ గండి శ్రీధర్ విలేకరులతో మాట్లాడారు. సైన్స్ విభాగంలో బిఎస్‌సిలో (ఎంపిసిఎస్) యోగిరెడ్డి కల్యాణి ఫిజిక్స్‌లో 28వ ర్యాంకు సాధించగా, ఆర్ట్స్ విభాగంలో బిఎ హెచ్ఇపి ఎస్టీ కేటగిరికి చెందిన నిమ్మక కిరణ్ విద్యార్థికి పొలిటికల్ సైన్స్‌లో 56వ ర్యాంకు సాధించి సత్తా చాటారన్నారు. పోటీ పరీక్షల్లోనే కాకుండా క్యాంపస్ ప్లేస్మెంట్లలో సాయిరాం డిగ్రీ విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యార్థులకు ధీటుగా ప్రతిభ కనబరుస్తున్నారని ఆ కళాశాల చీఫ్ మెంటర్ పెంట అప్పారావు అన్నారు. బిఎస్‌సిలో సిబిజెడ్ గ్రూపు విద్యార్థిని బి. శ్రీవల్యా, ఎంపి కంప్యూటర్స్ విద్యార్థిని ఎం.సుప్రియలు, టిసిఎస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో రూ.5 లక్షల ప్యాకేజీలో ఉద్యోగాలు పొందారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసిన అధ్యాపకులను, ర్యాంకులు, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజాశకిత - సాలూరురూరల్

గ్రీన్ అంబాసిడర్ల తొమ్మిది నెలలుగా బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు డిమాండ్ చేశారు. మండలంలోని తోణాంలో పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు వెట్టిచాకిరీ చేయిస్తున్న సరైన సమయంలో జీతాలందక తమ కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చేది తక్కువ వేతనం, అందులో అవి ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నెలల తరబడి జీతాలు అందక అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సిన వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా తమకు తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం ఇఒపిఆర్‌డికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు తవుడు, సుజాత, సింహాచలం, సునీల్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా భావితరాల భవిష్యత్తు కోసం గిరిజన ప్రాంతంలో గత రెండు రోజులుగా పాఠశాలలు సందర్శించి, వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు టిడిపి పాలకొండ నియోజకవర్గ అధ్యక్షులు బిడ్డిక దమయంతి నాయుడు అవగాహన కల్పించారు. సీతంపేటలో చేపట్టిన నాడు నేడు పనుల్లో అవకతవకలు ఉన్నాయని ఆమె ఆ పాఠశాలలు సందర్శించారు. మండలంలోని పెదరామ, కోపువలస, బిళ్లగూడ, తోరిక వలస గ్రామాల్లో పాఠశాలల బల్లలు మార్చారు తప్ప నిర్మాణాలు పనులు చేపట్టలేదన్నారు. అలాగే తోరికవలస భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, కొత్తగా భవనం కావాలని గ్రామస్తులు కోరారు. దీనికి ఆమె మాట్లాడుతూ వచ్చే ప్రభుత్వం తెలుగుదేశం అని అన్ని గిరిజన ప్రాంతంలోనిపాఠశాలలు దగ్గరుండి బాగుచేయించి మీ భవిష్యత్తుకు తాను గ్యారంటీ ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర మాలయ్య, మాజీ జడ్పీటీసీ పాలక రాజబాబు, మాజీ సర్పంచ్ సవర సూర్యారావు, సీనియర్ నాయకులు సవర కుర్మారావు సీనియర్ నాయకులు సవర రాము పాల్గొన్నారు..